

వైసీపీ ఉక్కిరిబిక్కిరి



నాలుగు నెలల క్రితం వరకూ కూడా టీడీపీని లైట్ తీసుకున్న జగన్ పార్టీ ఇప్పుడు.. నాలుగు చోట్ల వైసీపీకి డేంజర్ బెల్స్ మోగుతున్నట్లు అంచనాకు వచ్చింది. ఇంటెలిజెన్స్ సర్వే, ఐప్యాక్, సొంత మీడియా ఇతర వేగుల ద్వారా సేకరించిన సమాచారం ప్రకారం నాలుగు చోట్ల టీడీపీ బలంగా దూసుకుపోతున్నట్లు నివేదికలు రావడం వైసీపీ నేతలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నట్లు చెబుతున్నారు. ఎన్నికల షెడ్యూలు విడుదల కాకముందే సైకిలు పట్ల జనం సానుకూలంగా ఉండడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారంటారు. కడప, కమలాపురం, మైదుకూరు, జమ్మలమడుగులో టీడీపీ బుల్లెట్‌లా గ్రౌండ్ లెవల్‌లోకి చొచ్చుకెళ్లడాన్ని వైసీపీలో అంతర్మథనానికి గురి చేస్తోందని అంటున్నారు.

- ఇప్పటికి నాలుగు చోట్ల డేంజర్ బెల్స్
- ఎన్నికల నాటికి మరిన్నిచోట్ల ఫ్యాన్‌కు ఎదురుగాలి?
- అంతర్మథనంలో వైసీపీ నేతలు
- అభ్యర్థుల మార్పు అంటూ ప్రచారం
- దూసుకుపోతున్న టీడీపీ

(కడప-ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ సొంత జిల్లాలోనే ఫ్యానుకు ఉక్కబోత పోస్తోందా? నిన్నటి వరకు ఇక్కడంతా వార్ వన్‌సైడే, మళ్లీ ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ, రెండు పార్లమెంటును క్లీన్‌స్వీప్ చేస్తామని జబ్బలు చరుచుకున్న జగన్ శిబిరానికి ఎన్నికల షెడ్యూలు వచ్చే ముందర క్షేత్రస్థాయిలో వాస్తవం ఏంటో తెలిసిపోయిందా..? ఈసారి సొంత జిల్లాలో వన్‌సైడ్ కాదు టీడీపీ గట్టి పోటీ ఇస్తుంది, నాలుగు సీట్లుపైన గెలుచుకున్నా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని అంచనాకు వచ్చిందా..? అంటే అవుననని రాజకీయ పరిశీలకులు, వైసీపీ శ్రేణులు అంటున్నారు.

కడపలో దేశం దూకుడు

కడప నగరం జిల్లాకు హెడ్‌క్వార్టర్. ఇక్కడ ఏ పార్టీకైనా విజయం చాలా కీలకం. 1999 వరకు కడప అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ ఆధిపత్యం చూపిస్తూ వచ్చేది. 1994-99 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా దివంగత ఖలీల్‌బాషా ఎంపికయ్యారు. అయితే 2004 నుంచి టీడీపీ ప్రాబల్యం కోల్పోయింది. నాలుగు దఫాలుగా ఇక్కడ టీడీపీ గెలుపు రుచి చూడలేదు. అయితే ఈసారి చంద్రబాబునాయుడు కడపపై ప్రత్యేక కన్నేసి వ్యూహాత్మకంగా అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. కడప టీడీపీ అభ్యర్థిగా పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి సతీమణి ఆర్.మాధవీరెడ్డిని ఐదురోజుల క్రితం ప్రకటించారు. ఆమె రెండు నెలల క్రితం నుంచే రాకెట్‌లా జనాల్లోకి దూసుకెళుతున్నారు. బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ పేరిట కడప నగరాన్ని చుట్టేస్తున్నారు. అంజద్‌బాషా, ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ వెళ్లి జనాలకు వివరిస్తూ ప్రత్యర్థులపై పదునైన మాటల తూటాలు పేలుస్తున్నారు. చాపకింద నీరులా పెద్దసంఖ్యలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేర్చుకుంటూ వస్తున్నారు. ఇక్కడ టీడీపీ స్పీడు చూసి వైసీపీ కలవరపడుతోందంటారు. మాధవీరెడ్డి స్పీడ్ చూసి అంజద్‌బాషా అభ్యర్థిత్వాన్ని మారుస్తారనే ప్రచారం కూడా సాగుతోంది. రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఇక్కడ పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. వైసీపీ అంతర్గత సర్వేలు, ఇంటెలిజెన్స్ ఇతర వైసీపీ నాయకులు కడపలో టీడీపీ చాలా బలంగా ఉందనే విషయాన్ని గుర్తించారు. మాధవీరెడ్డి కూడా కడపలో టీడీపీ గెలుస్తుంది అనే పాజిటివ్ టాక్‌ను జనాల్లోకి, కేడర్‌లోకి తీసుకెళ్లారు. దీంతో ఇక్కడ అభ్యర్థిత్వంపై వైసీపీ తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం.

జమ్మలమడుగులో టీడీపీ జోష్

జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జిగా భూపేశ్‌రెడ్డిని ప్రకటించిన తరువాత ఆయన నియోజకవర్గాన్ని చుట్టేస్తున్నారు. ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులను టీడీపీలో చేర్చుకుంటున్నారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డికి చెందిన వర్గీయులను కూడా తిరిగి సొంత గూటికి తీసుకురావడంలో సఫలీకృతులయ్యారంటారు. స్టీలు ఫ్యాక్టరీ, ఇసుక అక్రమాలు ఇలా అన్నింటిలో పోరాటాలు చేస్తూ వచ్చారు. నిత్యం జనాలతో మమేకం కావడంతో పాటు కేడరుకు అందుబాటులో ఉంటున్నారు. జిల్లాలో వైసీపీ నేతలు కూడా జమ్మలమడుగులో ఈసారి టీడీపీ గెలుస్తుందనే చర్చించుకుంటున్నారు. అందుకే ఇక్కడ అసెంబ్లీకి ఎంపీ అవినాశ్‌లేదా జగన్ కుటుంబ సభ్యులు పోటీ చేస్తారని ప్రచారం సాగుతోంది.

ఈసారి మైదుకూరు..

మైదుకూరులో ఈసారి గెలవాలని టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ పట్టుదలతో ఉన్నారు. సర్వశక్తులు ఒడ్డి రెండు నెలలుగా వైసీపీ నుంచి భారీ ఎత్తున టీడీపీలోకి చేర్చుకుంటున్నారు. 20014, 2019 ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు. 2019లో ఓడిపోయినా మైదుకూరును ఎంతో అభివృద్ధి చేశానని, తనను ఒక్కసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానంటూ జనాలకు వివరిస్తూ ఊరూరు తిరుగుతున్నారు. ఇక్కడ టీడీపీ బలంగా కనిపించడంతో వైసీపీ కీలక నేతలంతా టీడీపీలోకి క్యూ కడుతున్నారు. బీమఠం జడ్పీటీసీ మరి కొందరు టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం ఉంది. వరుసగా రెండుసార్లు ఓడిపోవడంతో నియోజకవర్గ ఓటర్లలో సైతం సుధాకర్‌యాదవ్‌పై సానుభూతి ఉందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

కమలాపురంపై ఆశలు

కమలాపురంలో ఈసారి టీడీపీ గెలుస్తుందని అటు వైసీపీ, ఇటు టీడీపీలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. పుత్తా నరసింహారెడ్డి నిర్విరామంగా నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటిస్తున్నారు. ఇక్కడ వైసీపీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డిపై వ్యతిరేకత ఉందంటారు. దీంతో పాటు ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డికి, రవీంద్రనాథరెడ్డికి పెద్దగా సంబంధాలు లేవు. ఇప్పటికే వీఎన్‌పల్లె, చెన్నూరు, పెండ్లిమర్రి, సీకేదిన్నె మండలాల నుంచి పెద్ద ఎత్తున వైసీపీ నేతలను టీడీపీలో చేర్చుకున్నారు. ఇక్కడ టీడీపీ బలంగా కనిపిస్తుండడంతో సీటు మారుస్తారనే ప్రచారం సాగింది. ఇక్కడ కూడా జగన్ కుటుంబీకులు పోటీ చేస్తారని అంటున్నారు. మొత్తానికైతే ఇప్పటి అంచనాల మేరకు నాలుగుచోట్ల టీడీపీ దూసుకెళ్లడం వైసీపీని కలవరపాటుకు గురి చేస్తోందంటారు.

ఎన్నికల నాటికి..

ఇప్పటి వరకు వైసీపీ వారి అంచనా ప్రకారం కడప, మైదుకూరు, జమ్మలమడుగు, మైదుకూరులో ఫ్యానుకు ఎదురుగాలి వీస్తోంది. ఇక పులివెందులలో టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి సైతం ప్రచారంలో దూసుకుపోతున్నారు. వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి ఇదే నియోజకవర్గంలో ఉన్నారు. వీరిద్దరూ టీడీపీ విజయం కోసం గట్టిగా పోరాడుతున్నారు. ఇక ప్రొద్దుటూరులో సైతం మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, సీఎం సురేశ్‌నాయుడు, ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి దూసుకుపోతున్నారు. బద్వేలులో టీడీపీ యువనేత రితేశ్‌రెడ్డి పాదయాత్ర చేసి నియోజకవర్గం మొత్తం చుట్టేశారు. రోశన్న, రితేశ్, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ మూడుచోట్ల కూడా వైసీపీకి ఎదురుగాలి వీస్తోందని.. ఎన్నికల నాటికి ఫ్యాన్ స్విచ్ఛాఫ్ అయిపోయే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.



పరీక్ష కేంద్రంలోకి పరుగులు తీస్తున్న విద్యార్థులు





ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

- తొలిరోజు 92 శాతం మంది హాజరు

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి1: జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు 92 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. శుక్రవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు 17,042 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 16,398 మంది (92శాతం) హాజరై 644 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులకు సంబంధించి 15,696 మందికి గాను 15,135 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,346 మందికి గాను 1,263 మంది హాజరయ్యారు. నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ నిబంధనతో విద్యార్థులు అర్ధగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. అలాగే పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని ఆర్ఐవో వెంకటసుబ్బయ్య తెలిపారు.



హాల్‌టికెట్లను పరిశీలించి కేంద్రంలోకి అనుమతిస్తున్న అధికారులు

కడప నగరానికి మైలవరం జలాశయం నీళ్లు



కడప (ఎడ్యుకేషన్), మార్చి 1: మైలవరం జలాశయం నుంచి కడప నగరానికి మరో మూడు రోజుల్లో నీళ్లు చేరుతాయని కార్పొరేషన్ డీఈఈ కరీముల్లా ఖాన్ తెలిపారు. నాలుగు రోజుల క్రితం మైలవరం జలాశయం నుంచి నీటిని విడుదల చేశామన్నారు. ప్రస్తుతం కమలాపురానికి నీటి ప్రవాహం చేరిందని, అయితే నీటి ప్రవాహంలో 40 శాతం వృధా అవుతుందని చెప్పారు. అదనంగా మరింత నీటిని విడుదల చేయాలని కలెక్టరు విజయరామరాజు, కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ మైలవరం అధికారులను ఆదేశించారన్నారు. కడప నగరానికి సరిపడా నీరు మరో మూడు రోజుల్లో రానుందని, అంతవరకు నీటిని పొదుపుగా వాడుకోవాలని నగర వాసులను కోరారు.

టీడీపీ పోస్టర్లపై రంగేశారు

- చర్యలు తీసుకోవాలంటూ ఎస్పీకి ఎమ్మెల్సీ ఫిర్యాదు

కడప (క్రైం), మార్చి 1: పులివెందుల నియోజకవర్గంలో అంటించిన వాల్‌పోస్టర్లపై రంగు వేశారని, దీనిపై విచారణ జరిపి బాధ్యులపై కేసు నమోదు చేయాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌కు ఫిర్యాదు చేశారు. టీడీపీ మేనిఫెస్టోలో ఉన్న విషయాలను ప్రజలకు తెలియజెప్పాలని వాల్‌పోస్టర్లు ముద్రించి వివిధ ప్రాంతాల్లో గోడలకు అంటించామన్నారు. గురువారం రాత్రి కొందరు దుండగులు వాటిపైన రంగు పూశారన్నారు. తొండూరు, పార్నపల్లి, పైడిపాలెం తదితర రహదారుల్లో ఉన్న వాటిని చెడగొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇవన్నీ కూడా సీసీ కెమెరాలో ఉన్న ప్రాంతాల్లోనే చేశారని, వీటిని పరిశీలిస్తే నిందితులను గుర్తించవచ్చన్నారు. ఎన్నికల ముందు ఇలాంటి ఘటనలు శాంతికి విఘాతం కలిగిస్తాయన్నారు. ఈ చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు.



తొండూరులో టీడీపీ అంటించిన పోస్టర్‌పై రంగు వేసిన దృశ్యం

ఎన్నికలకు సంసిద్ధం : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), మార్చి 1: త్వరలో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉన్నామని కలెక్టర్ విజయరామరాజ పేర్కొన్నారు. శుక్రవారం రాజధాని అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎన్నికల సన్నద్ధత, ఎన్నికల ప్రక్రియకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ గణేశ్ కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్‌గౌడ్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ఎపిక్ కార్డుల ముద్రణ, పంపిణీ, శిక్షణ కార్యక్రమాలు, ఫిర్యాదులు, ప్రతికూల వార్తలు, జిల్లా కంట్రోల్ రూమ్, సోషల్ మీడియా సెల్ ఏర్పాటుతో పాటు పలు అంశాలపై కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ విధివిధానాల మేరకు జిల్లాలో అన్ని కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నామన్నారు. జిల్లాలో ఓటరు చేర్పులు, మార్పులు, తొలగింపులకు సంబంధించి వచ్చిన దరఖాస్తులన్నింటినీ దాదాపు పరిష్కరించామన్నారు. ఎపిక్ కార్డుల ముద్రణ, పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు శిక్షణ పూర్తిచేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, సహాయ అధికారులు, ఎన్నికల విధులు నిర్వహించే జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యాదీవెన రూ.34.52 కోట్లు జమ

కడప(కలెక్టరేట్), మార్చి1: జిల్లాలోని 44,876 మంది విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన మొత్తం రూ.రూ.34.52 కోట్లు మంజూరైంది. శుక్రవారం కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గం బహిరంగ సభ నుంచి ముఖ్యంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వర్చువల్ విధానం ద్వారా 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి జగనన్న విద్యాదీవెన రీయింబర్స్‌మెంట్ లబ్ధి మొత్తాన్ని ల్యాప్‌టాప్ బటన్ నొక్కి అర్హుల ఖాతాల్లో జమ చేశారు. కడప కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ విజయరామరాజుతో పాటు రాష్ట్ర పీఆర్ శాఖ సలహాదారు నాగార్జున రెడ్డి, రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు పి.శివప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. ముఖ్యమంత్రి కార్యక్రమం ముగిసిన అనంతరం జిల్లాలో అర్హులైన విద్యార్థులు, వారి తల్లులకు అతిథులతో కలసి రూ.34.52 కోట్ల మెగాచెక్కును కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా తొలిసారిగా పూర్తి స్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేయడం రాష్ట్ర ప్రజల అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేశాఖ డీడీ సరస్వతి, ఎస్సీ, మైనార్టీ కార్పొరేషన్ల ఈడీలు డాక్టర్ వెంకటసుబ్బయ్య, డాక్టర్ బ్రహ్మయ్య, సంక్షేమ శాఖల అధికారులు, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

వైసీపీ విధ్వంస పాలనకు తుదిరోజులు

- జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపేందుకు జనం సిద్ధం
- బీజేపీ ప్రజాపోరు జిల్లా కన్వీనర్ సింగారెడ్డి

కడప (మారుతీనగర్), మార్చి 1: రాష్ట్రంలో సాగుతున్న వైసీపీ విధ్వంసకర పాలనకు తుదిరోజులు దగ్గరపడ్డాయని బీజేపీ ప్రజాపోరు జిల్లా కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బీజేపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రాజీవ్‌పార్క్ వద్ద ప్రజాపోరు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సింగారెడ్డి మాట్లాడారు. జగన్‌రెడ్డి పాలనలో ఇప్పటికే ప్రజలు విసిగి పోయారన్నారు. అభివృద్ధిని అటకెక్కించి, సంక్షేమాన్ని మంటగలిపి ఆ పార్టీ నాయకులంతా రాష్ట్ర సంపదతో పాటు ప్రకృతి సహజ వనరులను సైతం వదలకుండా దోచుకోవడం, దాచుకోవడంతోనే సరిపోయిందని ఆరోపించారు. నీటి పన్ను, ఇంటి పన్ను, చెత్తపన్ను అంటూ సామాన్య, పేద ప్రజలను తీవ్ర ఇబ్బందుల పాలు చేస్తున్నతీరు దారుణమన్నారు. కేంద్రప్రభుత్వం ద్వారా వచ్చే నిధులతో వైసీపీ ప్రభుత్వం సోకులు పోతుందే తప్ప రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగున్నర సంవత్సరాలకు పైగా రాష్ట్రంలో అణగారిన వర్గాలపై వైసీపీ నేతలతో పాటు ఆ పార్టీ చోటా మోటా నాయకుల రౌడీయిజాలు, దౌర్జన్యాలు, భూ ఆక్రమణలు, స్థలాల ఆక్రమణలు, బెదిరింపులు, దాడులు, హత్యలు, మానభంగాలు పెచ్చుమీరాయన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నారన్నారు. కేంద్రంలో పది సంవత్సరాలుగా సాగుతున్న బీజేపీ సుపరిపాలనకు మద్దతుగా, రాష్ట్రంలో ఐదు సంవత్సరాలుగా సాగుతున్న రౌడీపాలనకు వ్యతిరేకంగా ప్రజలను అప్రమత్తం చేయాలనే ధ్యేయంతో బీజేపీ అన్ని జిల్లాల్లో ప్రజాపోరు కార్యక్రమం చేపట్టామన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రానున్నదని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణయాదవ్, నాయకులు సుబ్బారెడ్డి, బీజేపీ కడప పార్లమెంట్ కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు, లక్ష్మీనారాయణరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కడప రాజీవ్ పార్కు వద్ద మాట్లాడుతున్న బీజేపీ ప్రజాపోరు జిల్లా కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి

కొత్తపల్లె ఉపకాలువ కబ్జా



కొత్తపల్లె ఉపకాలువను పూడ్చి పైపు లైను వేసిన దృశ్యం

- పూడ్చివేసి నిర్మాణాలు చేపడుతున్న కబ్జాదారులు
- రూ.13 కోట్ల విలువైన 86 సెంట్ల మేర కాలువ కనుమరుగు
- స్థానికుల ఫిర్యాదుతో సర్వేచేసిన అధికారులు
- రెవెన్యూ అధికారుల సర్వేలో ఆక్రమణల గుర్తింపు
- అయినా అక్రమ కట్టడాలను అడ్డుకోని వైనం

ప్రొద్దుటూరు, మార్చి 1: వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఎక్కడ ప్రభుత్వ స్థలాలున్నా యథేచ్ఛగా కబ్జాచేస్తున్నారు. ప్రభుత్వ భూములు పరిరక్షించాల్సిన అధికార యంత్రాంగం నిద్రపోతోంది. ముఖ్యంగా పంటకాలువలైతే ఎక్కడికక్కడ ఆక్రమణలకు గురవుతున్నాయి. ప్రొద్దుటూరులోని కొత్తపల్లె పంచాయతీ దినదినాభివృద్ధి చెంది ఎన్నో లేఅవుట్‌లు వెలిశాయి. అపార్ట్‌మెంట్లు, విల్లాలు, గ్రీన్‌ల్యాండులు, వైట్‌హౌస్‌లు బాగా అభివృద్ధి చెందాయి. ఈ ప్రాంతంలో సెంటు ధర రూ.15 లక్షలకు పైగా విలువ చేస్తోంది. స్థలాల ధర పెరగడం, పెద్దఎత్తున ఇళ్ల నిర్మాణాలు సాగుతుండటంతో కబ్జాదారుల కన్ను ప్రభుత్వ స్థలాలమీద పడింది. దీంతో కొత్తపల్లె పంచాయతీలోని కొత్తపల్లె ఉపకాలువ ఆక్రమణలకు గురవుతోంది.

పూడ్చివేసి నిర్మాణాలు

కొత్తపల్లె ఉపకాలువ సినీ హబ్ ఏరియా బొంగుబజార్ నుంచి టీచర్స్ కాలనీ ఏరియా గుండా పలు సర్వేనెంబర్లలో వెళుతుంది. ముఖ్యంగా 411 సర్వేనెంబరులో 42 సెంట్లు, 412లో 42 సెంట్లు, 416లో 29 సెంట్లు, 417లో 26 సెంట్లలో కాలువ ఉంది. ఈ కాలువను ఎక్కడిక్కడ పూడ్చివేస్తూ కబ్జాదారులు నిర్మాణాలు చేపడుతున్నారు. కాలువను గ్రీన్‌లాండ్ వెళ్లేదారి నుంచి వైట్‌హౌస్ గుండా జేమ్స్‌పేట వరకు పూర్తిగా పూడ్చి ప్రైవేటు స్థలాల్లో కలిపేసుకున్నారు. ప్రభుత్వ కాలువను పరిరక్షించాల్సిన అధికారులు అటువైపు తొంగిచూడటం లేదు. కొత్తపల్లె పంచాయతీ అధికారులు కబ్జాదారుల వద్ద భారీగా ముడుపులు తీసుకుని ఇళ్లకు ప్లాన్లు, విద్యుత్ సరఫరాకు అనుమతి ఇవ్వడం, ట్యాప్ కనెక్షన్లు ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

32 సెంట్లలో ఆక్రమణలున్నట్లు సర్వేలో వెల్లడి

మండల విలేజ్ సర్వేయర్లు 411 సర్వేనెంబరులో సర్వే చేయగా 32 సెంట్లు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. ఇందులో 12 సెంట్లలో అక్రమ నిర్మాణలు చేపట్టినట్లు తెలిపారు. 14 సెంట్ల మేర రోడ్డుగా వినియోగించుకుంటున్నారని వెల్లడించారు. ఇందులో అధికారపార్టీకి చెందిన ఒక మున్సిపల్ కౌన్సిలర్ కాలువ ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడుతున్నట్లు స్థానికులు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. కాలువ ఉన్న అన్ని సర్వే నెంబర్లలోనూ కబ్జాకు గురైందని, సర్వే చేస్తే ఇవన్నీ వెలుగులోకి వస్తాయని స్థానికులు పేర్కొంటున్నారు.

86 సెంట్ల కాలువ కనుమరుగు

కొత్తపల్లె ఉపకాలువ సర్వేనెంబరు 413లో 46 సెంట్లు, సర్వేనెంబరు 414లో 40 సెంట్లు మొత్తం 86 సెంట్లమేర కాలువ పూర్తి స్థాయిలో భూమిమీద కనుమరుగు అయింది. ఇది రెవెన్యూ రికార్డుల్లో మాత్రమే ఉంది. ఈ కాలువ స్థలాన్ని ప్రైవేటు స్థలాల్లో కలిపేసుకున్నారు. కానీ వీటి మీద నిర్మాణాలైతే జరగలేదు. ఆక్రమణకు గురైన ఈ స్థలం దాదాపు రూ.13కోట్ల విలువ చేస్తుంది. ఇప్పటికైనా అధికారులు సర్వేచేసి హద్దు రాళ్లు పాతి కాలువ స్థలాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ కట్టడాలపై ఫిర్యాదు

కొత్తపల్లె ఉపకాలువ ఆక్రమణలపై హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర సహాయకార్యదర్శి కరుణాకర్ రెవెన్యూ అధికారులకు, లోకాయుక్తకు సైతం ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి కాలువ ఆక్రమణలపై చర్యలు తీసుకోకుంటే హైకోర్టులో కేసు వేస్తానని ఆయన తెలిపారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

కొత్తపల్లె ఉపకాలువ ఆక్రమణలపై పరిశీలించి చర్యలు తీసుకుంటాం. పంచాయతీ అధికారులతో కలిసి అక్రమ కట్టడాలపై చర్యలకు ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తాం.

- విద్యాసాగర్, తహశీల్దారు, ప్రొద్దుటూరు



ఆక్రమణలతో కుంచించుకుపోయిన కొత్తపల్లె ఉపకాలువ



కాలువను పూడ్చి అక్రమ నిర్మాణం జరుగుతున్న దృశ్యం

టీడీపీ, జనసేన అధికారంలోకి రావడం ఖాయం

● టీడీపీ నాయకుడు చెన్నంశెట్టి మురళి



మాట్లాడుతున్న చెన్నంశెట్టి మురళీక్రిష్ణ

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 1: రాష్ట్రంలో టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రావడం ఖాయమని టీడీపీ నాయకుడు చెన్నంశెట్టి మురళి తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డిపై అసభ్య పదజాలంతో మాట్లాడారని వైసీపీ నాయకులపై ఆయన మండిపడ్డారు. వైసీపీకి మహిళలను ఏడిపించడమే ధ్యేయంగా పెట్టుకున్నారన్నారు. చరిత్రలో మహిళలను ఏడిపించిన వారు ఏ ఒక్కరూ పైకి రాలేదని వైసీపీ నాయకులకు హితబోధ చేశారు. టీడీపీ నాయకులు రాంప్రసాద్‌రెడ్డి, కత్తి రవీంద్ర, గంపా వీరయ్య పాల్గొన్నారు.

కాపీలను అరికట్టాలి: ఆర్‌ఎస్‌యూ

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 1 : ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి వేంపల్లెలో ఓ హైస్కూలులో జరుగుతున్న కాపీలు అరికట్టాలని ఆర్‌ఎస్‌యు జిల్లా అధ్యక్షులు ప్రశాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్‌ఐవో కార్యాలయంలో ఆర్‌ఐఓ వెంకటసుబ్బయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ పరీక్ష కేంద్రంలో అదే పాఠశాలలో ఇంటర్ బోధించే అధ్యాపకులను పరీక్షల డ్యూటీలోఉంచారని తెలిపారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యూ నాయకులు చెన్నకేశవరెడ్డి, హరిబాబు, కన్నయ్య పాల్గొన్నారు.

వెల్లటూరులో ప్రథమ చికిత్స కేంద్రం సీజ్

పెండ్లిమర్రి, మార్చి 1: మండలంలోని వెల్లటూరు గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న రెడ్డి బాష ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేసినట్లు పెండ్లిమర్రి వైద్యాధికారి జేవీఆర్ ప్రసాద్ తెలిపారు. డీఎంహెచ్‌ఓ నాగరాజు ఆదేశాల మేరకు వెల్లటూరులో ఉన్న రెడ్డి బాష ప్రథమ చికిత్స కేంద్రాన్ని తనిఖీ చేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నందున కేంద్రాన్ని సీజ్ చేశామన్నారు. ఇదిలా ఉండగా ఉదయం సీజ్ చేస్తే సాయంత్రం క్లినిక్ ఓపెన్ చేసియదావిధిగా నడపడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

కూలీలకు కొత్త రేట్లు పెంచాలి

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 1 : కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండు కార్గో ఆవరణంలో ఏపీ ఎస్ ఆర్టీసీ లైసెన్స్ పోర్టర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ అనుబంధంతో కడపలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆర్‌టీ లైసెన్స్ పోర్టర్స్‌కు కొత్త కూలీ రేట్లు పెంపుదల అగ్రిమెంటు చేయాలన్నారు. ఆర్టీసీ కార్గోలో లోడింగ్ అన్‌లోడింగ్ పనులునిర్వహించు హమాలీ పోర్టర్స్‌కుఎగుమతి, దిగుమతి కూలీ రేట్లు పెంచి రెండు ఏళ్లు దాటిపోయిందన్నారు. ప్రస్తుతం ఇచ్చే కూలీలు కార్మికులకు సరిపోవడంలేదన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 1 : విజయనగరం జిల్లాలో ఉన్న మహారాజ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంటు కళాశాలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పాత బస్టాండులో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు.

మురుగు పోయే దారేదీ..?

● సగం వరకే మురుగుకాల్వ కడితే నీరు పోయేదెలా?

● నెలలుగా పనులు జరగక కాల్వలో పెరిగిన జంబు

● హైవే వరకు కాల్వలు నిర్మిస్తేనే సమస్యకు పరిష్కారం

చెన్నూరు, మార్చి 1 : కాల్వ నిర్మాణాన్ని సగంలోనే ఆపేశారు. దీంతో నీరు పోయే దారిలేక ఇళ్ల మధ్యనే నిల్వ చేరడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి... చెన్నూరు మండలంలోని బుడ్డాయపల్లెలో వ్యవసాయ పొలాల నుంచి ఆ గ్రామ ఇళ్ల గుండా గతంలో ఏర్పాటైన కాంక్రీటు కాల్వలను మురుగు కాల్వలుగా ప్రజలు ఉపయోగించుకుంటున్నారు.ఆ మురుగు కాల్వలు సగం వరకు మాత్రమే ఉండటంతో కాల్వల్లో ప్రవహించే నీరు బయటికి వెళ్లే అవకాశం లేక ఇళ్ల మధ్యలోనే ఆగుతుంది. ఆ నీటిలో తుంగ, జంబు, పిచ్చిమొక్కలు పెరిగాయి. దీంతో విపరీతమైన కంపుతోపాటు దోమల దాడి కూడా ఎక్కువగా ఉందని ప్రజలు తెలిపారు. చాలా కాలంగా ఈ సమస్యతో సతమతమవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎప్పుడో ఏర్పాటు చేసిన కాంక్రీటు కాల్వ కొంత వరకు మాత్రమే నిర్మించి వదిలిపెట్టారు. అప్పట్లో ప్రజలు 'కాల్వలు పూర్తి చేయండి, ఈ కాల్వను హైవే వరకు ఏర్పాటు చేస్తే సమస్య ఉండదు, లేదంటే ఈ మురుగు వెళ్లేందుకు ప్రత్యామ్నాయంగా ఏదో వైపు కాల్వ పనులు ఏర్పాటు చేయండి, మురుగునీరు ఇళ్ల మధ్యనే వదిలేస్తే ఎలా' అని ప్రశ్నించారు. గతంలో పంచాయతీ సిబ్బందికి ఈ విషయం తెలుపగా వారు కొంత వరకు మాత్రమే కాలవలు శుభ్రం చేసి వదిలేశారు. పూర్తిగా శుభ్రం చేయకపోవడంతో ఇళ్ల మధ్యనే దుర్వాసన వస్తోంది. ఈ సమస్యను ఆ దారిన వెళ్లే ప్రజాప్రతినిధులు, అధికారులు చూస్తూనే ఉంటారని, అయినా ఈ కాల్వ విషయంలో ఎందుకింత నిర్లక్ష్యమని బుడ్డాయపల్లె ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వెంటనే సమస్యను తీర్చాలని, లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.





బుడ్డాయపల్లె వద్ద సగం కాల్వ మాత్రమే పూర్తి చేయడంతో కాల్వలో నిలిచిన మురుగు నీరు... మురుగు కాల్వలో పెరిగిన జంబు

అవినీతి పాలకులను సాగనంపుదాం

● 60 కుటుంబాలు టీడీపీలోకి చేరిక ● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి





కమలాపురం: టీడీపీలోకి చేరుతున్న వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న పుత్తా... వేంపల్లె: టీడీపీని ఆదరించాలని కోరుతున్న బీటెక్ రవి

కమలాపురం రూరల్, మార్చి 1 : అవినీతి పాలకులను సాగనంపుదాం, ప్రజా పరిపాలన తెచ్చుకుందాం అప్పుడే మనకు భవిష్యత్తు భరోసా ఉంటుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని గోపులాపురం, పాచికలపాడు,విభరాపురం గ్రామాల్లో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహిచారు. ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరిస్తూ రాబోవు ఎన్నికల్లో టీడీపీ గెలిపించాలని కోరారు. అనంతరం గోపులాపురం, పాచికలపాడు, విభరాపురం తదితర గ్రామాల్లో మాజీ సర్పంచ్ గంగయ్య, ఖాజా ఫక్రుద్దీన్ మాజీ ఎంపీటీసీ చెన్నారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలోకి దాదాపు 60 కుటుంబాలు చేరాయి. వారందరికీ ఆయన టీడీపీ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో ఒక్క ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా నిరుద్యోగ యువతను మోసం చేసిందన్నారు. అనంతరం టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు పరిచే సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా, జంపాల నరసింహారెడ్డి, మండల కన్వీనరు రాఘవరెడ్డి, దివాకర్‌రెడ్డి, కంకరసుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, ధర్మారెడ్డి, వాసుదేవరెడ్డి, ఎల్లారెడ్డి, సుబ్బరాయుడు, రామమునిరెడ్డి, శంకర్ యాదవ్, రవిశంకర్‌యాదవ్, దాదిరామయ్య, నబీ చిన్నసుబ్బారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రసూల్, బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీతోనే సంక్షేమం, అభివృద్ధి

వేంపల్లె, మార్చి 1: తెలుగుదేశం పార్టీ ద్వారానే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి తెలిపారు. వేంపల్లెలోని దేవాంగవీధి, ఆర్‌ఎంఎస్ కాలనీ, బండల ఉత్తన్న సందు, కాలేజీరోడ్డు, గొర్లమందల కాలనీ తదితర ప్రాంతాలలో శుక్రవారం బాబుష్యూరిటీ కార్యక్రమంలో భాగంగా బీటెక్ రవి, ఆయన సతీమణి లతారెడ్డిలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ దర్బార్ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ-జనసేన మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు షబ్బీర్, మునిరెడ్డి, ఆర్వీ రమేష్, నందిపల్లె రామగంగిరెడ్డి, భద్ర, మహబూబ్ షరీఫ్, మస్తాన్, మడకా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ మేనిఫెస్టో పోస్టరు విడుదల

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 1 :విద్యారంగ పునరుజ్జీవం కోసం ఏబీవీపీ ఆధ్వర్యంలో మార్చి 5న తిరుపతిలో విడుదల చేయబోయే స్టూడెంట్ మేనిఫెస్టోకు సంబంధించి పోస్టర్లను ఏబీవీపీ నాయకులు ఆర్ట్స్ కళాశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లిఖార్జున మాట్లాడుతూ విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తుల నుంచి విముక్తి చేస్తామని చెప్పి అధికారం అనుభవించిన రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల ఊబిలో చిక్కుకుపోయారన్నారు. రాష్ట్రంలో విద్యారంగానికి 30 శాతం బడ్జెట్ కేటాయించాల్సి ఉండగా ఈ రోజు రాష్ట్ర బడ్జెట్‌లో 5 శాతం మాత్రమే కేటాయిస్తూ విద్యారంగాన్ని గాలికి వదిలేశారని విమర్శించారు.

'సమసమాజ స్థాపన బీఎస్‌పీతోనే సాధ్యం'



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డిబాబు

కడప (మారుతీనగర్), మార్చి 1:సమసమాజ స్థాపన బీఎస్‌పీతోనే సాధ్యమని రాష్ట్ర కార్యదర్శి దుడం రెడ్డిబాబు పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప జిల్లాలోని అన్ని స్థానాలలో తమ పార్టీ అభ్యర్థులు బరిలో ఉంటారన్నారు. ప్రస్తుత అధికార, ప్రతిపక్ష పార్టీలలో దళిత, గిరిజన, బహుజన, ముస్లిం, మైనార్టీ వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. సమావేశంలో బీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు సగిలి గుర్రప్ప, కానుగ దానం, పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన వ్యక్తి రంగారెడ్డి



పదవీ విరమణ పొందిన రంగారెడ్డిని సత్కరిస్తున్న దేవస్థాన చైర్మన్లు

చక్రాయపేట, మార్చి 1: ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన వ్యక్తి బొజ్జా రంగారెడ్డి అని ఎంఈఓ రామచంద్రారెడ్డి, దేవస్థాన చైర్మన్లు లాయర్ రామంజనేయరెడ్డి, బి.చక్రపాణిరెడ్డి కొనియాడారు. రంగారెడ్డి పదవీ విరమణ సందర్భంగా మండల కేంద్రంలోని వేంకటేశ్వర, రాచరాయ దేవస్థానాల కల్యాణ మండపంలో సన్మానం చేశారు. ఈ సన్మానానికి జిల్లా నుంచి దాదాపు 200మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రంగారెడ్డి ఉపాధ్యాయ వృత్తిలో సుదీర్ఘంగా సేవలందించి ఎంతోమంది మన్ననలు పొందారన్నారు. పదవీ విరమణ అనేది ఉద్యోగికి సహజమని, కాకపోతే పేరుప్రతిష్ఠలు తెచ్చుకోవడం ఒక నైపుణ్యమన్నారు.

చిత్తశుద్ధితో సేవలందిస్తేనే ప్రజలలో గుర్తింపు లభిస్తుందన్నారు. రంగారెడ్డి శక్తి వంచన లేకుండా సేవలందించి ప్రజలలో మంచిపేరు తెచ్చు కోగలిగారన్నారు. రంగారెడ్డి గత మూడు సంవత్సరాలుగా వేంకటేశ్వర, రాచరాయ దేవస్థానాల అభివృద్ధికి కృషిచేస్తూ ప్రజల మన్ననలు పొందారన్నారు. సౌమ్యుడు, సేవాగుణం, స్వచ్ఛంద సేవల్లో పాల్గొనడం ఆయన నైజమని పలువురు పేర్కొన్నారు. రంగారెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ రామిరెడ్డిగారి ఓబుళరెడ్డి, ఎస్టీయూ నాయకులు గంగవరపు శివారెడ్డి, భాస్కర్‌రెడ్డితో పాటు ఇందుకూరు శ్రీనివాసులు, మనోహర్ రెడ్డి, ఈశ్వరయ్య, శ్రీరామమూర్తి, ఆపస్ రామాంజనేయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కాంప్లెక్స్ లీజుపై సీఈఓ బహిర్గతం చేయాలి: ఏఐటీయూసీ



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా

కడప (నాగరాజుపేట), మార్చి 1 : జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణంలో నూతనంగా నిర్మిస్తున్న కాంప్లెక్స్ ఓ ప్రైవేటు జూనియర్ కళాశాల లీజుకు సంబంధించి సీఈఓ బహిర్గతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక హోచిమన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాదుల్లా మాట్లాడారు. నూతనంగా నిర్మిస్తున్న కాంప్లెక్స్‌కు కళాశాల బ్యానరు తగిలించి తొలగించడం వెనుక ఏ మతలబు దాగి ఉందో బహిర్గతం చేయాలన్నారు. సదరు జూనియర్ కళాశాల కోటిరెడ్డిసర్కిల్ పక్కనే ఓ అద్దె భవనం తీసుకుని ప్రచారం నిర్వహిస్తోందన్నారు. జిల్లా పరిషత్ పాలక మండలి ఆమోదం పొందినదా లేకపోతే బహిరంగ లీజు ప్రకటన ద్వారా కాంప్లెక్స్ ఎంత డబ్బుకు, ఎప్పటి నుంచి కళాశాల నడుస్తుందో చెప్పాలన్నారు. కాంప్లెక్స్ లీజు వెనుకాల రూ.లక్షలు అధికార పార్టీ నాయకులకు ముట్టిందని జిల్లా పరిషత్ కార్యాలయంలోని అధికారులు చెవులు కొరుక్కుంటున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు సుబ్బరాయుడు, జిల్లా కార్యదర్శి లింగన్న పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు నియమాలు పాటించండి

చక్రాయపేట, మార్చి 1: ప్రమాదాల నివారణకు వాహనదారులు నియమాలు పాటించాలని ట్రిపుల్ ఐటీ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. మండలంలోని మారెళ్లమడక గ్రామంలో శుక్రవారం ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-9 బృందం రోడ్‌సేఫ్టీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనదారులకు రోడ్డు నిబంధనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. వాహనదారులు హెల్మెట్, సీటు బెల్ట్ తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రంగారావు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అన్ని పత్రాలు దగ్గర ఉంచుకోవాలన్నారు.

ఓడిపోతామన్న భయంతోనే

వైసీపీ నేతల బహిరంగ క్షమాపణ

● క్షమాపణ చెప్పాల్సింది అహ్మద్‌బాషా

● టీడీపీ నేతలు హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 1 : కడప నియోజకవర్గంలో ఓడిపోతామన్న భయంతోనే వైసీపీ నేతలు బహిరంగ క్షమాపణలు చెబుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. క్షమాపణ చెప్పాల్సింది అహ్మద్‌బాషా, ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అని స్పష్టం చేశారు. శుక్రవారం కడప నగరం టీడీపీ జిల్లా కార్యాలయంలో వారు మాట్లాడుతూ అహ్మద్‌బాషా తప్పు చేసి మహిళలను కించపరిచి మాట్లాడడం ఇప్పుడు వారు క్షమాపణలు చెప్పకుండా కార్పొరేటర్ల చేత ఏమీ సంబంధం లేని వ్యక్తి అయిన టీటీడీ బోర్డు మెంబరు మాసీమబాబు చేత క్షమాపణ చెప్పించడం ఏమిటని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వస్తుందని తెలుసుకున్న నాయకులు దాన్ని జీర్ణించుకోలేక ఇలా మహిళలను కించపరిచి మాట్లాడితే మహిళల ఓట్లు పడవని తెలిసి ఇప్పుడు బహిరంగ క్షమాపణ చెప్పారన్నారు. టీడీపీ నాయకులు పోతుగంటి పీరయ్య, జలతోటి జయకుమార్, జియావుద్దీన్, బడుగు రామాంజనేయులు యాదవ్, అహ్మద్, మహిళా నాయకురాలు పార్వతి పాల్గొన్నారు.

మహిళలను కించపరిచే వ్యాఖ్యలు మతసామరస్యమా

● టీడీపీ నేత యాటగిరిరాంప్రసాద్



మాట్లాడుతున్న రాంప్రసాద్

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 1 :సభ్య సమాజం తలదించుకునేలా మహిళ అని కూడా చూడకుండా టీడీపీ కడప అభ్యర్థి మాధవీరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మతసామరస్యమా అని టీడీపీ బెస్తసాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు యాటగిరి రాంప్రసాద్, నాయకులు కొమ్మల పాటి సురేష్ అన్నారు. శుక్రవారం 5వ డివిజన్ టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ మహిళ ఆత్మగౌరవాన్ని మత సామరస్యంతో ముడిపెట్టడం రాజకీయమన్నారు. మాసీమబాబుకు చిత్తశుద్ధి ఉంటే అంజద్ సోదరులతో బహిరంగ క్షమాపణ చెప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు బండి జయశేఖర్, శిలాస్‌రాజ్, ఆవుల వెంకటేశ్, చక్రి, గిరి, ప్రసన్న సాయి, రాము, భరత్, శివ, మునిరాజ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం దిశగా మేనిఫెస్టో ఉండాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 1: రైతుల సంక్షేమం దిశగా మేనిఫెస్టో ఉండాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో ఏపీ రైతు సంఘం కడప జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైతుల సంక్షేమం ఎన్నికల మేనిఫెస్టోలు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో రైతాంగానికి లబ్ధి చేకూర్చే విధంగా ఎన్నికల మేనిఫెస్టోలు ఉండాలన్నారు. గతంలో టీడీపీ, వైసీపీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీల వర్షం కురిపించారన్నారు. వాటిని విస్మరించడం అన్యాయమన్నారు. రైతు భరోసా, రుణమాఫీ వంటి పథకాలకు మాత్రమే బటన్ నొక్కి రైతులను మభ్యపెడుతున్నారన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి, అధ్యక్షుడు గోపాలక్రిష్ణయ్య, రైతు స్వరాజ్యవేదిక జిల్లా కన్వీనర్ శివారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, రైతు సేవా సమితి అధ్యక్షుడు రమణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, నగర కార్యదర్శి రామ్మోహన్, సీఐటీయూ నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, డీవైఎఫ్‌ఐ నగర కార్యదర్శి ఓబులేసు, హేతువాద సంఘం జిల్లా కార్యదర్శి సీఆర్వీ ప్రసాద్, రైతు సంఘం నాయకులు రామచంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, చిన్నసిద్దయ్య పాల్గొన్నారు.

సిమెంటు బస్తా రూ.200కే ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న గాలి చంద్ర

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 1: సిమెంటు బస్తా రూ.200కే ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు.శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయం లో జరిగిన విలేకరుల సమావేశంలో చంద్ర మాట్లాడారు. కడప జిల్లాలో భారతి, జువారి, ఇండియా, కోరమాండల్, దాల్మియా సిమెంటు పరిశ్రమల ఏర్పాటుకు భూములతో పాటు కరెంటు నీళ్లు అందించిన జిల్లా ప్రజానీకానికి ఉపాధి అవకాశాలు కల్పించకపోగా కాలుష్య నియంత్రణ ప్రమాణాలు పాటించకపోవడం వల్ల పరిశ్రమల పరిసరాల్లో వ్యర్థాలతో పంట దిగుబడి తగ్గడమే కాకుండా నివాస ప్రాంతాల్లో కాలుష్య కారకాలతో ప్రజలు శ్వాసకోశ సంబంధ వ్యాధులతో బాధపడుతున్నారని విమర్శించారు. సిమెంటు ఉత్పత్తికి అవసరమైన వనరులన్నీ జిల్లా నుండి పొంది, జిల్లా ప్రజలకు అధిక ధరలకు సిమెంటు విక్రయిస్తుండడం దారుణమన్నారు. యాజమాన్యాల తీరు మారకుంటే ప్రత్యక్ష ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు కేసీ బాదుల్లా, జిల్లా సమితి సభ్యులు మునెయ్య పాల్గొన్నారు.

6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వల్లూరు, మార్చి 1 :మండల పరిధిలోని గంగాయపల్లె ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం. సురేష్‌బాబు తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను ఆరవతరగతిలో ప్రవేశం పొందగోరువారు ఓసీ, బీసీ రూ.150, ఎస్సీ ఎస్టీలకు రూ.75 చెల్లించి ఈ నెల 31లోపు ఏపీఎంఎస్.ఏపీ.జీవోవీ.ఐఎన్ నందు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రవేశాలు ప్రతిభ ఆధారంగా అనగా ప్రవేశపరీక్షలను నిర్వహించి అందులో మార్కులు ఆధారంగా. రిజర్వేషన్ ప్రకారంగా ప్రవేశాలు ఉంటాయన్నారు.ముఖ్యంగా వల్లూరు మండలానికి మొదటి ప్రాధాన్యతనందిస్తామని అన్నారు. ఏప్రిల్ 21ఆదివారం పాఠశాలలో ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. ఇంకా ఏవైనా వివరాలు కావాల్సి వస్తే తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కానీ గంగాయపల్లెలోని ఆదర్శ పాఠశాలను సందర్శిస్తే పూర్తి విషయాలు తెలుపుతామని అన్నారు. కావున తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కంచి పీఠాధిపతి దర్శనానికి వేలాదిగా తరలిన భక్తులు

కడప (కల్చరల్), మార్చి 1: కడపకు విచ్చేసిన కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి దర్శనానికి ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. కడప-తిరుపతి రోడ్డు మార్గంలో వెలసిన చిన్మయ మిషన్ వారి లలితా పంచాయతన దేవాలయంలో శుక్రవారం భక్తుల కోరిక మేరకు ప్రత్యేకంగా దర్శనమిచ్చారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి భక్తులు ఉదయం 7 గంటలకే చేరుకుని బారులు తీరారు. స్వామీజీ ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరించి వారి బాగోగులు అడిగి తెలుసుకుని ఆశీర్వదించారు.

ఇందులో భాగంగా పలువురు ప్రభుత్వ అధికారులు, వ్యాపారులు, ఉద్యోగులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు, స్వామి ఆశీస్సులు అందుకున్నారు. తదనంతరం గోపూజ, సువాసిని పూజ, గురుపాదుకా పూజతో పాటు త్రికాల పూజలు, నిర్వహించారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు చిన్మయ మిషన్ సభ్యులను ఉద్దేశించి స్వామివారు ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు.

చేతికి బైక్ దొరికితే..



రాకెట్‌లా దూసుకుపోతున్నారు

- తీరు మారని మైనర్లు
- ప్రమాదాల బారిన యువత
- కౌన్సెలింగ్ ఇచ్చినా మారని వైనం
- తల్లిదండ్రులలో కనిపించని మార్పు

కడప (క్రైం), మార్చి 1: వాళ్లది తెలిసీ తెలియని వయస్సు. పట్టుమని 18 ఏళ్లు కూడా నిండని వారు చేతికి బైకు దొరికితే చాలు.. రాకెట్‌లా దూసుకు పోతున్నారు. రోడ్లపై విన్యాసాలు ప్రదర్శిస్తూ ఇష్టానుసారం డ్రైవ్ చేస్తున్నారు. అడ్డూ అదుపు లేని వేగంతో బైకులు నడుపుతూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. వీరితో పాటు ఎదురుగా వచ్చిన వారిని ఢీకొంటూ ప్రమాదాలకు గురిచేస్తున్నారు. ఇలా ఎంతో మంది యువత ఇటీవల ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోవడం.. కాళ్లు, చేతులు కోల్పోయి అవిటివాళ్లుగా మారి తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చుతున్నారు.

జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. నిబంధనలకు విరుద్ధంగా తిరిగే



వాహనాలపై కొరఢా ఝులిపించారు. ఓవర్ స్పీడ్, మైనర్ల డ్రైవింగ్‌పై ప్రత్యేక టీమ్‌లతో నిఘా పెట్టారు. పోలీసులతో ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టి.. పట్టుబడిన వాహనాలు నెలరోజుల పాటు వదలకుండా పోలీసు స్టేషన్లలోనే ఉంచారు. చివరికి వాహనదారులతో పాటు వాహనం డ్రైవింగ్ చేసిన వారికి జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో భారీ ఎత్తున కౌన్సెలింగ్ నిర్వహించారు. పట్టుబడిన వారిలో మైనర్లు ఉంటే.. వారితో పాటు కుటుంబ సభ్యులకు కూడా కౌన్సెలింగ్ ఇచ్చారు. తెలిసీ తెలియని వయస్సులో పిల్లలకు ఇలా బైకులు ఇవ్వకూడదని.. ఇస్తే ప్రమాదాలు కొని తెచ్చుకున్నట్లు అవుతుందని చెప్పడంతో పాటు.. ఇలాగే బైకులు ఇచ్చి పంపితే మీపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని గట్టిగా హెచ్చరికలు జారీ చేసి పంపారు. అయినప్పటికీ పిల్లల తల్లిదండ్రుల్లో మార్పు రాకపోగా.. అతి గారాభంతోనో.. మారం చేశారనో బైకులు కొనిచ్చి ప్రమాదాలకు కారణమవుతున్నారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..

కడపలో ఇంటర్ కళాశాల చదువుతున్న విద్యార్థులు ఎక్కువగా స్కూటీలు, పెద్ద పెద్ద బైకులపై వెళుతూ కనిపిస్తున్నారు. పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్నా వీరు సందుగొందుల్లో నుంచి తప్పించుకు వెళుతున్నారు. ఒక్కో బైకులో ఒకరిద్దరు కాదు.. ఏకంగా ముగ్గురు నలుగురు కూర్చుని వెళుతుండడం గమనార్హం. మైనర్ల డ్రైవింగ్‌పై పోలీసులు ఎంత ఫోకస్ పెట్టినా... కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహిస్తుండడంతో వీరికి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. తమ పిల్లలు హీరోల్లా రోడ్లపై బైకులు స్పీడుగా నడుపుతుంటే సంబరపడిపోయే తల్లిదండ్రులు ఉండటం గమనార్హం. మరికొందరు తమ డాబు, దర్పం చూపించుకోవడానికి స్వయంగా పిల్లలకు స్పోర్ట్స్ బైకులు కొని గిఫ్ట్‌గా ఇస్తున్నారు. దీంతో పిల్లలు మితిమీరిన వేగంతో బైకుల్లో తిరుగుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

పిల్లలు మారాం చేశారని..

పిల్లలు అడిగారని, మారాం చేశారని కొంత మంది తల్లిదండ్రులు బైకులు కొనిపిస్తున్నారు. అది కూడా రోడ్డుపై రయ్‌మనే దూసుకెళ్లే స్పోర్ట్స్ బైకులు, పల్సర్, ఎఫ్‌జెడ్‌లాంటి బైకులు కొనిపిస్తున్నారు. వీరికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం... వాహనాలను అదుపు చేసే సామర్థ్యం ఉండకపోవడంతో అతి వేగం, ట్రిబుల్, అంత కన్నా ఎక్కువ మందితో నిర్లక్ష్యంతో వాహనాలు నడుపుతున్నారు. ఒకవేళ పోలీసులకు పట్టుబడినా తమ పిల్లాడు తప్పు చేశాడన్న భావన వారి తల్లిదండ్రుల్లో ఏ మాత్రం కనబడడంలేదు. తమ బిడ్డ ఏదో తెలియక వాహనం నడిపాడని పోలీసులకు నచ్చజెప్పి వాహనాలను తీసుకెళుతున్నారు. ఆ తరువాత కూడా పిల్లలను మందలించకుండా మళ్లీ వాహనాలు ఇస్తుండడం గమనార్హం.

బైకులపై విన్యాసాలు చేస్తూ..

ఇంటర్ చదివే కొంతమంది విద్యార్థులు 15 నుంచి 17 సంవత్సరాలు కూడా ఉండవు. వీళ్లు కళాశాలలకు ద్విచక్ర వాహనాల్లో రయ్‌మంటూ వెళుతున్నారు. కొన్ని కళాశాలల్లో ద్విచక్ర వాహనాలకు అనుమతులు లేవు. అలాంటి చోట చుట్టుపక్కల పార్కింగ్ చేసి కాలేజీలకు వెళుతున్నారు. కొందరు అయితే నేరుగా కళాశాలలోకి బైకులు తీసుకెళుతున్నారు. స్కూటరుపై ముగ్గురు లేదా నలుగురితో కలిసి డ్రైవింగ్ చేస్తున్నారు. మరీ ముఖ్యంగా అమ్మాయిలు ఎదురుపడ్డారంటే ఇక వారి స్పీడ్‌కు అడ్డూ అదుపూ ఉండదు. బైకు ముందు భాగం పైకి ఎత్తెత్తి నడపడం, ఇంకొందరైతే బైకు నేలమీదకు ఒంచి తోలడం లాంటి సర్కస్ ఫీట్లు చేస్తున్నారు. ఏదైనా తేడా జరిగితే గాలిలో ప్రాణాలు కలిసిపోతు న్నాయి. ఇలాంటి వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తే కొన్ని రోడ్డు ప్రమాదాలనైనా నివారించవచ్చని పలువురు అంటున్నారు. అలాగే పిల్లల తల్లిదండ్రుల్లో కూడా తప్పక మార్పు రావాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి : ఎస్పీ



ఆర్డీవో కార్యాలయంలో పోలీసు అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ సిద్ధార్థ కౌశల్

జమ్మలమడుగు, మార్చి 1: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఆదేశించారు. శుక్రవారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గంలోని పోలీసు అధికారులు, సిబ్బందికి ఎన్నికల కార్యాచరణకు సంబంధించి సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో నియోజకవర్గంలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నట్లుగా సమాచారం. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలాంటి ఘటనలు జరగకుండా చూడాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఇప్పటి నుంచే ప్రజలతో మంచి సంబంధాలు కలిగి.. ముందస్తు సమాచారం సేకరించాలని సూచించారు. కాగా, సమావేశానికి మీడియాను అనుమతించలేదు. అక్కడున్న అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదు. కార్యక్రమంలో డీఎస్పీ యశ్వంత్, ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్, నియోజకవర్గంలోని సీఐలు, ఎస్ఐలు, సెక్టార్ పోలీసు అధికారులు, ఎలక్షన్ సెల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలించిన ఎస్పీ

జమ్మలమడుగు మండలంలోని అంబవరం గ్రామం వద్ద ప్రధాన రోడ్డుకు పక్కన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఎస్పీ సిద్ధార్థ కౌశల్ పరిశీలించారు. ఎన్నికల విధుల్లో భాగంగా జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గానికి రానున్న కేంద్ర సాయుధ బలగాలకు వసతి సౌకర్యం నిమిత్తం కళాశాలలో సందర్శించి పరిశీలించారు. కేంద్ర బలగాల సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వసతులు ఏర్పాటు చేయాలని స్థానిక పోలీసు అధికారులకు తెలియజేశారు.

సినీ ఫక్కీలో మోసం

- మహిళను మోసగించి రూ.50 వేలు కాజేసిన యువకుడు

రాజంపేటటౌన్, మార్చి 1: పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు వద్ద ఉన్న ఏటీఎంలో నగదు తీసి ఇస్తానని చెప్పి రూ.50 వేలను కాజేసిన చేసిన విషయాన్ని సింగనమల రాజేశ్వరి శుక్రవారం రాజంపేట పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని ఎస్‌బీఐ ఏడీబీ సమీపంలోని ఏటీఎంలో డబ్బులు కోసం వెళ్లిన రాజేశ్వరి ఎంత ప్రయత్నించినా డబ్బు రాలేదు. దాంతో, పక్కనే ఉన్న యువకుడు తాను ప్రయత్నిస్తానని చెప్పి, ఆమె వద్ద ఉన్న ఏటీఎం పాస్‌వర్డ్ తెలుసుకుని ఏటీఎం నుంచి నగదును విత్‌డ్రా చేసేందుకు ప్రయత్నించాడు. చివరికి సాధ్యం కాలేదని చెప్పి ఏటీఎం కార్డు ఇచ్చి వెళ్లిపోయాడు. గురువారం 1.30 గంటల సమయంలో ఆమె బ్యాంకు ఖాతాలో ఉన్న నగదును రూ.10 వేల చొప్పున 5 సార్లు డ్రా చేసినట్లు బ్యాంకు అధికారుల ద్వారా తెలుసుకొని పట్టణ పోలీసులను ఆశ్రయించినట్లు బాధితురాలు తెలిపారు.

కారు ఢీకొని యువకుడు మృతి



మృతుడు హరీష్ (ఫైల్)

గుర్రంకొండ, మార్చి 1: కారు అతివేగంగా రోడ్డుపై నుంచి వేగ నిరోధకాన్ని ఢీకొన డంతో ఇనుపరాడ్ తగిలి యువకుడు మృతి చెందిన సంఘటన మార్కెట్ యార్డు వద్ద శుక్రవారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం మేరకు... గుర్రంకొండ పంచాయతీ తలారివాండ్ల పల్లెకు చెందిన నరసింహులు కుమా రుడు కొమ్మిరి హరీష్(24) డ్రైవింగ్ పనిచేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సాయంత్రం సొంత పనుల నిమిత్తం గుర్రంకొండ మార్కెట్ యార్డుకు వచ్చాడు. హరీష్ మదనపల్లె-గుర్రంకొండ రోడ్డు పక్కనున్న ఓ హోటల్ ముందు నిలబడి ఉండగా మదనపల్లె నుంచి అతి వేగంగా వచ్చి కారు రోడ్డుపై వేగాన్ని నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన బోర్డును ఢీకొంది. ఈ నేపథ్యంలో వేగ నిరోధకానికి ఉన్న ఇనుప రాడ్ నిలబడి ఉన్న హరీష్ నుదుటకు తగిలింది. ఈ ఘటనలో హరీష్ నుదుటకు తీవ్ర రక్త గాయమైంది. బాధితున్ని 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి చనిపోయినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, రెండు నెలల కుమారుడు ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

కరెంటు తీగలు తగిలి వ్యక్తి మృతి

సుండుపల్లె, మార్చి 1: మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ జనార్దన్‌రెడ్డినగర్ కాలనీకి చెందిన మేకల ద్వారకనాథ్ (45) కరెంటు తీగలు తగిలి మృతి చెందినట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. ఇతను విద్యుత్‌కంచెను ఏర్పాటు చేసి కుందేళ్లను వేటాడేవాడు. ఇదే క్రమంలో గత శుక్రవారం జనార్దన్‌రెడ్డి నగర్‌కాలనీ సమీపంలోని మామిడి తోటలో ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతనిని తిరుపతికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మొక్కల సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలి



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కడప(ఎర్రముక్కపల్లె), మార్చి 1: మొక్కల సంరక్షణను వలంటీర్లు బాధ్యతగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రొఫెసరు ఎస్.రఘునాథరెడ్డి తెలిపారు. శుక్రవారం వైవీయూ ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మొక్కలను నాటించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వలంటీరు మొక్కలకు నీరుపోసి వాటి బాగోగులను బాధ్యతగా తీసుకోవాలన్నారు. దీనివల్ల మీ డిపార్ట్‌మెంటు పరిసరాలు పచ్చదనంతో పాటు కాలుష్యం లేకుండా ఆహ్లాదకరంగా ఉంటాయన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రెడ్డయ్య వలంటీర్లకు సూచనలు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్వేత, నారాయణరెడ్డి, హనుమంతనాయక్, జ్యోతి పాల్గొన్నారు.

రెండు ఇళ్లలో చోరీ - నగలు అపహరణ

ములకలచెరువు, మార్చి 1: ములకలచెరువులో గురువారం రాత్రి రెండిళ్లలో చోరీ జరిగినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. స్థానిక కదిరి రోడ్డులో ఉంటున్న బాల్‌రెడ్డి కుటుంబీకులు బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దొంగలు తాళాలు తొలగించి లోనికి ప్రవేశించారు. ఇంట్లోని రెండు బీరువాలను పగులగొట్టి అందులోని 31 గ్రాముల బంగారు నగలను ఎత్తుకెళ్లారు. అలాగే పక్కింట్లో కూడా ఓ బంగారు ఉంగరాన్ని, కొంత నగదును చోరీ చేసినట్లు ఆయన తెలిపారు. చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. క్లూస్ టీ అధికారులు వేలిముద్రలను సేకరించినట్లు వివరించారు.

ముదిరాజ్ సంఘం కన్వీనర్‌గా నాగేశ్వరరావు

ఎర్రగుంట్ల, మార్చి 1: కడప పార్లమెంటు ముదిరాజ్ (ముత్రాస) టీడీపీ సాధికార సమితి కమిటీ కన్వీనర్‌గా సుంకర నాగేశ్వరరావును నియమించినట్లు ప్రకటనలో తెలిపారు. ఆయనతో పాటు సి.రామాంజనేయులు, వెంకటరమణయ్య, సి.నాగరాజు, వెంకట సుబ్బయ్య, ఎస్.లోకేశ్, కె.శ్రీనివాసులు, ఎం.నాగరాజు, సి.నాగేంద్ర, జి.వెంకటరమణ, పి.రామప్రసాద్‌రావు, కె.రమణయ్య, పి.భరత్‌కుమార్, బి.ఓబులేసులను కమిటీ సభ్యులుగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- పల్స్ పోలియో ఏర్పాట్లు పూర్తి
- రేపు 0-5 సంవత్సరాల చిన్నారులకు టీకా వ్యాక్సిన్ పంపిణీ
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు

కడప(కలెక్టరేట్), మార్చి 1: పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ తమవంతు సహకారం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు పిలుపు నిచ్చారు. శుక్రవారం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలోని తన చాంబరులో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం ఈ నెల 3న జిల్లా వ్యాప్తంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని, 0-5 ఏళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కల మందు వేయుటకు 2029 పోలియో బూత్‌లు, 51 మొబైల్ బృందాలు పనిచేయనున్నాయన్నారు. 23 ట్రాన్సిట్ పాయింట్స్ ద్వారా 8264 వ్యాక్సినేటర్స్, 203 రూట్ సూపర్‌వైజర్ల ద్వారా ఈ కార్యక్రమం విజయవంతం చేయుటకు ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. భారతదేశం పోలియో రహిత దేశంగా ప్రటించడం జరిగిందని, అయినప్పటికీ పొరుగు దేశం పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల్లో పోలియో కేసులు ఉండడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మన ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో 2006 తరువాత పోలియో కేసుల నమోదు కాలేదన్నారు. వలసలు వచ్చిన వారు, భవన నిర్మాణ కార్మికులు, గ్రామాలకు దూరంగా నివసించే వారి పిల్లలతో పాటు పట్టణ మురికివాడల్లో ఈ వ్యాక్సిన్ చిన్నారులకు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వందశాతం పోలియో చుక్కలు వేయుటకు సిద్ధంగా ఉన్నామన్నారు. జిల్లా టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ మాట్లాడుతూ 0-5 ఏళ్ల చిన్నారులకు టీకా మందు అందించేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్లు శశిభూషణ్‌రెడ్డి, రవిబాబు, రమేష్, సునీత, మాస్ మీడియా అధికారిణి భారతి, సహ మీడియా అధికారిణి రమణమ్మ, కమ్యూనిటీ ఆరోగ్య అధికారి మునిరెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి రాధాకృష్ణ తదితరులు పాల్గొని పోస్టరును విడుదల చేశారు.



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

రాచమల్లు చేసిన వ్యాఖ్యలు అవాస్తవం : శశిభూషణ్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి

ప్రొద్దుటూరు, మార్చి 1: భారతీయ జనతా పార్టీ మతతత్వ పార్టీ అని.. ముస్లిం మైనారిటీ ఓట్ల కోసం ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అవాస్తవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అంటే మాఫియాకు కేరాఫ్ అడ్రస్ అని.. నీకు బీజేపీ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. బీజేపీ దేశంలోని 140 కోట్ల జనాభాను సమానంగా చుస్తుందన్నారు. ప్రొద్దుటూరులో నీ ఓటమి ఖరారైందని తెలుసుకుని.. ముస్లిం ఓటర్ల కోసం బీజేపీని మతతత్వ పార్టీ అని ప్రచారం చేస్తే నమ్మే పరిస్థితి లేదన్నారు. జగన్ ప్రభుత్వంలో వైసీపీ ఎమ్మెల్యేలు.. ముఖ్యంగా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఈ ఐదేళ్లకు ముందు ఐదేళ్ల తరువాత ఆస్తులు భవనాలపై నాడు నేడు కింద బహిరంగ పరచాలన్నారు. వందల కోట్ల రూపాయలు భూదందాలు, ఇసుక దోపిడీ, మట్కా, గుట్కా, క్రికెట్ బెట్టింగ్, దొంగనోట్లు ఇలా అన్నిరకాల అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ.. నేర సామ్రాజ్యాన్ని నిర్మించుకుని ప్రొద్దుటూరును పాలిస్తున్నాడని తీవ్రంగా విమర్శించారు. నీ అవినీతి, దౌర్జన్యాలు హత్యా రాజకీయాలపై ప్రజలు త్వరలో తీర్పు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ప్రధాని నరేంద్రమోదీ పేదలకు ఉచితంగా బియ్యం, ఇళ్లు, ఆయుష్మాన్ భారత్ కింద వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. కేంద్ర నిధులు పథకాలను తమ పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మీ పతనం తప్పదని హెచ్చరించారు. సమా వేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి క్రిష్ణప్రదీప్‌రెడ్డి, గురు ప్రసాద్, రవి, వంకదార నరేంద్రలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ముఖ్యం

- సమగ్రశిక్ష పీవో అంబవరం ప్రభాకర్‌రెడ్డి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రభాకర్‌రెడ్డి, దుర్గాప్రసాద్

కడప(ఎర్రముక్కపల్లె), మార్చి 1: ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలు, బ్యాంకు లావాదేవీలపై విద్యార్థులకు అవగాహన ఎంతో ముఖ్యమని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజరు దుర్గాప్రసాద్ తెలిపారు. శుక్రవారం కడప నగరం చెమ్మమియాపేట బాలికోన్నత పాఠశాల, గాంధీనగర్ మున్సిపల్ హైస్కూలు, శ్రీహరి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బ్యాంకింగ్ రంగంపై సైబర్ నేరాలు, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించి క్విజ్ పోటీలు, ఎస్సే రైటింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్లను లీడ్ బ్యాంకు మేనేజరు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో అందించారు. వారు మాట్లాడుతూ రానున్న కాలంలో సైబర్ నేరాల గురించి అవగాహన పెంపొందించుకుని వాటికి దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు సమాజం, వ్యవస్థలపై సంపూర్ణ అవగాహన ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మేరీ, సుజాతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక డంపింగ్‌పై పోలీసుల ఆరా

మదనపల్లెటౌన్, మార్చి 1: మదనపల్లె పట్టణ శివారుల్లో ఇసుక డంపింగ్, అక్రమ రవాణాపై పోలీసులు ఆరా తీస్తున్నారు. 'పగలు డంపింగ్.. రాత్రి స్మగ్లింగ్' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన వార్తకు మదనపల్లె తాలూకా పోలీసులు స్పందించారు. మదనపల్లె మండలం తురకపల్లె ఈద్గా వద్ద, చిప్పిలి గ్రామంలోని ఇళ్ల మధ్య వందలాది టిప్పర్ల ఇసుకను డంపింగ్ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మదనపల్లె తాలూకా సీఐ శేఖర్ ఈ విషయమై ఆరా తీయాల్సిందిగా ఎస్ఐ రవికుమార్‌ను ఆదేశించారు. దీంతో శుక్రవారం ఎస్ఐ, సిబ్బందితో తురకపల్లె వద్ద డంపింగ్ చేసిన నిల్వలను పరిశీలించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

పాలిసెట్, ఏపీఆర్‌జేసీలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), మార్చి 1: ఏపీ రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు(ఇంటర్మీడియట్), పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీఆర్‌జేసీ, పాలిసెట్ ప్రవేశ పరీక్షలకు అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతున్నారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తిరుపతిలోని విశ్వం పోటీ పరీక్షల శిక్షణా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాల కోసం ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు దరఖాస్తు చేయవచ్చని, ఈనెల 31వ తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. అలాగే డిప్లొమా పాలిటెక్నిక్ కోర్సుల కోసం నిర్వహించే పాలిసెట్‌కి ఏప్రిల్ 5వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 8688888802/03, 9399976999 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఇదిలా ఉండగా ఏపీఆర్‌జేసీకి దరఖాస్తు గడువు మార్చి 31 కాగా, పరీక్ష తేది ఏప్రిల్ 25 ఉంటుందని, ఏపీపాలిసెట్ దరఖాస్తు గడువు ఏప్రిల్ 5 కాగా, పరీక్ష ఏప్రిల్ 27 ఉంటుందని తెలిపారు.

అగ్నికి ఆహుతవుతున్న మల్లయ్యకొండ

తంబళ్లపల్లె, మార్చి 1: తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్యకొండ అటవీ ప్రాంత సముదాయాలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టడంతో అవి దావానంలా వ్యాపించాయి. దీంతో మల్లయ్యకొండ రోడ్డుకు తూర్పు వైపు ఉన్న ఎద్దుమీదిబోడు, మేకపోతుదొన, రెండు దొనాలపెంట తదితర ప్రాంతాలు సుమారు 400 హెక్టార్లకు పైగా అగ్నికి ఆహుతైనట్లు తెలుస్తోంది. వందల ఎకరాల్లో అడవి కాలిపోవడంతో పలు రకాల జాతులకు చెందిన వృక్ష సంపదతో పాటు వన్యప్రాణులు, పశుగ్రాసం, బోద మంటలకు కాలి బూడిదైపోయింది. కొండ కింద వ్యవసాయ పొలాలున్న రైతులు తమ పొలాల్లోకి పెద్ద ఎత్తున మంటలు రావడంతో ఆందోళన చెందారు. కొందరు రైతులు తీవ్రంగా శ్రమించి పొలాల్లోకి వచ్చిన మంటలను అదుపుచేశారు. కాగా, వారం రోజుల కిందట ఆకతాయిలు నిప్పుపెట్టడంతో మర్రి కొండలో సుమారు 600 హెక్టార్లకు పైగా అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే. ఇప్పటికైనా అటవీశాఖాధికారులు అడవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

చంద్రబాబుతోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న అరుణ, లక్ష్మిదేవిలు

బద్వేలు రూరల్: రాబోవు ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు సీఎంగా పీఠమెక్కితేనే రాష్ట్రంలోని యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు, మహిళా సంక్షేమం, రైతాంగానికి మేలు ఉంటుందని బొజ్జ అరుణ, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మిదేవి, పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ హబీబున్నీసాలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సి పాలిటీ పరిధిలోని 21వ వార్డు, తెలుగుగంగ రోడ్డు, రామాంజనేయనగర్‌లలో భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచి పెట్టారు. కార్యక్రమంలో 25వ వార్డు కౌన్సిలరు శివమ్మ, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు జహంగీర్‌బాషా, మాచుపల్లె వెంకటక్రిష్ణారెడ్డి, ఉప్పతి సుబ్బారెడ్డి, ఫక్కీరయ్య, తుంగా నరసింహ తదితరులు పాల్గొన్నారు.





జమ్మలమడుగులో కొలవలి గ్రామస్థులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న భూపేశ్‌రెడ్డి, ఎర్రగుంట్ల రాణీవనంలో ప్రచారం నిర్వహిస్తున్న భూపేష్‌రెడ్డి సతీమణి జ్యోతి

అభివృద్ధి జరగాలంటే.. చంద్రబాబు సీఎం కావాలి

జమ్మలమడుగు, మార్చి 1: రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు రావాలని టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి అభ్యర్థించారు. శుక్రవారం జమ్మలమడుగు పట్టణంలో 13, 18 వార్డుల్లో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ఇంటింటికి వెళ్లి సూపర్ -6 పథకాలను తెలియజేసి తనకు ఈసారి సైకిల్‌గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ నాయకులు దేవగుడి యూత్ బాలపుల్లారెడ్డి, గండిశ్రీను, దాదాపీర్, మదార్‌వలి, మున్నా, షబ్బీర్, ఫరాజ్, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కొలవలి గ్రామస్థులు టీడీపీలో చేరిక

జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ముద్దనూరు మండలం కొలవలి గ్రామానికి చెందిన 50 కుటుంబాలవారు తెలుగుదేశ పార్టీలో చేరారు. టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి టీడీపీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వేణుగోపాల్, కొండయ్య, సాయి,సంజీవ, పెద్దకొండయ్య, ఆర్.శ్రీను, వెంకటసుబ్బయ్య, సుధాకర్ తదితర కుటుంబాల వారు ఉన్నారు.

ఎర్రగుంట్ల : జమ్మలమడుగులో మరింత అభివృద్ధి జరగాలంటే టీడీపీకి ఓటేసి భూపేష్‌రెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి జ్యోతి శుక్రవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని స్థానిక 20వ వార్డులోని రాణీవనంలో నిర్వహించారు. టీడీపీ మ్యానుఫ్యాస్టోలోని ఆరు గ్యారెంటీలను ఇంటింటికి వెళ్లి వివరించారు. రాణీవనంలోని ఓ దుకాణం వద్ద ఆమె బజ్జీలు వేసి అందరిని ఆకట్టుకున్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు వడ్డమాని వెంకటశివారెడ్డి, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి



ప్రచారంలో పాల్గొన్న సురేష్ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి

ప్రొద్దుటూరు, మార్చి 1: వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని.. కొద్ది రోజుల్లోనే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందని టీడీపీ రాష్ట్ర నాయకుడు సీఎం సురేష్ నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక 30వ వార్డులో బాబూ షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ముందస్తు మ్యానిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణ రెడ్డి, మాజీ మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ వీఎస్ ముక్తియార్, టీడీపీ రాష్ట్రకార్యదర్శి ఈవీ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అక్రమంగా గెలవాలని చూస్తోంది



పాత అమృతనగర్ ప్రచారంలో పాల్గొన్న ప్రవీణ్‌రెడ్డి

ప్రొద్దుటూరు, మార్చి 1: వైసీపీ అక్రమంగా గెలిచేందుకు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తోందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కొత్తపల్లె పంచాయితీలోని పాత అమృతనగర్‌లో బాబూ షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ ఆరు గ్యారెంటీల కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్ర మంలో మండల కన్వీనర్ బాబాల్‌రెడ్డి, రాజుపాలెం మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, ఆర్‌ఎంపీ ప్రసాద్, పాల సుబ్బరాయుడు, బాబాఫక్రుద్దీన్, రమణారెడ్డి, మారుతీ, ఆవుల దస్తగిరి, తాటిశ్రీను తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే నాయీ బ్రాహ్మణుల అభివృద్ధి

పోరుమామిళ్ల, మార్చి 1: చంద్రబాబు హయాంలోనే నాయీ బ్రాహ్మణులకు న్యాయం జరిగిందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికారి ప్రతినిధి కొలవలి వేణు గోపాల్ అన్నారు. శుక్రవారం నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యులు కొమెర్ల రామక్రిష్ణ ఆధ్వర్యంలో పోరుమామిళ్లలో నాయీ బ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధి టీడీపీ ధ్యేయమని... అందుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు వైసీపీ ప్రభుత్వం ద్రోహం తప్ప చేసింది శూన్యమన్నారు. టీడీపీ బీసీ నాయకులు కోడూరు లక్ష్మి నారాయణ, గోవిందాయపల్లె క్రిష్ణయ్య, శ్రీనివాసులు, శివ, గోపవరం శ్రీనివాసులు, వని పెంట సిద్దయ్య, రాము, బద్వేలు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ

బద్వేలు, మార్చి 1: బద్వేలు మున్సిపాలిటీలో ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఆస్తి మరియు ఖాళీ జాగా పన్ను విషయంపై ఏకమొత్తంలో పన్నులు చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ క్రిష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న అసలును ఏకమొత్తంలో చెల్లించిన వారికి ఆస్తి పన్నుపై ఉన్న వడ్డీ మొత్తం మాఫీ చేయడం జరుగుతుందన్నారు. 31వ తేదీ లోపు ఆస్తి, ఖాళీ జాగా పన్ను బకాయిలను వడ్డీ లేకుండా చెల్లించవచ్చని.. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్ కార్డు ద్వారా కూడా చెల్లించి వడ్డీ మినహాయింపు లబ్ధి పొందవచ్చని తెలిపారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కాశినాయన మార్చి 1: నర్సాపురంలోని ఏపీ ఆదర్శపాఠశాలలో 6వ తరగతి ప్రవేశాలకోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ సౌజన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓసీ, బీసీలు రూ.150లు, ఎస్సీ, ఎస్టీలు రూ.75లు చెల్లించి మార్చి 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 21న పాఠశాలలో ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. మెరిట్ ఆధారంగా రిజర్వేషన్‌ల ప్రాతిపదికన అడ్మిషన్‌లు ఉంటాయని తెలిపారు.

6వ తరగతి ప్రవేశానికి...

ఖాజీపేట, మార్చి 1: ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ ఎం.విజయ నరసింహ అన్నారు. 2024-25 సంవత్సరానికి ఆన్‌లైన్‌లో మార్చి 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 21వ తేదీ పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, ఉత్తీర్ణులైన వారికి మండల విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత, మిగతావారికి రెండవ ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వాలి

జమ్మలమడుగు, మార్చి 1: జమ్మలమడుగు విద్యుత్తు సబ్‌డివిజన్ పరిధిలో వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేశారు. ముద్దనూరు మండలానికి సంబంధించిన ఉల్లి రైతులు ముందుగా జమ్మలమడుగులోని విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లి అక్కడ అధికారులు లేకపోవడంతో జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. నాలుగు నెలల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఒక్కొక్కరు రూ.12,400 డిపాజిట్ చేసినట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు లేక పంట పొలాలు ఎండిపోతాయని అడుగుతున్నా సంబందిత అధికారులు కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లు అందించాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేశారు. జమ్మలమడుగు విద్యుత్తు శాఖ డీఈ రాజగోపాల్‌ను 'ఆంధ్రజ్యోతి' అడుగగా ముద్దనూరు మండలంలో 90 ట్రాన్స్‌ఫార్మర్లు, కొండాపురం మండలంలో 50 ట్రాన్స్‌ఫార్మర్లు కావాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని.. ఇంతవరకు ట్రాన్స్‌ఫార్మర్లు అందించలేదని ఆయన తెలిపారు.

పేదలకు అన్నదానం

పోరుమామిళ్ల, మార్చి 1: పోరుమామిళ్ల పంచాయతీ పరిధిలోని రామాయపల్లె ఎస్టీ కాలనీలో నిరుపేదలకు వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రెడ్డికొట్టాల గ్రామానికి చెందిన శకునాల నారాయణమ్మ వర్థంతి సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాజేశ్వరి, బొజ్జ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ఆలయ కార్యవర్గం ప్రమాణస్వీకారం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 1: రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయం నూతన కార్యవర్గం శనివారం ఉదయం ప్రమాణ స్వీకారం చేయనుంది. ఆలయ చైర్మన్‌గా మార్తల రాజారెడ్డి, పాలక మండలి సభ్యులుగా సన్నుతి శ్రీనివాసులు, కామిశెట్టి సుప్రియ, నల్లపోతుల కాత్య, యల్లనూరు జ్యోత్స్న, ఎం.తులశమ్మ, ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా రాజశేఖర్ శర్మ ప్రమాణస్వీకారం చేయనున్నారు.

భక్తిశ్రద్ధలతో శివదీపోత్సవం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 1: స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శివదీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్రస్వాహాకార హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేక వాహనంపై ఆశీనులను చేసి శివనామస్మరణలతో పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. దారి పొడవునా భక్తులు స్వామివారికి కాయాకర్పూరం సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కుకున్నారు.

నేషనల్ హైవేపై గుంతలు పూడ్చాలి

కొండాపురం, మార్చి 1: కడప-తాడిపత్రి జాతీయ రహదారిలో వెంటనే గుంతలు పూడ్చాలని సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు, రైతుసంఘం మండల ప్రధాన కార్యదర్శి వైవి.సుదర్శన్‌రెడ్డిలు కోరారు. ఈ మేరకు ఎంపీడీవో నాగప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం హైవే విస్తరణ పనులు ముద్దనూరు నుంచి తాడిపత్రి వరకు జరుగుతున్నాయని, ముఖ్యంగా బ్రిడ్జి నిర్మాణపు పనులవద్ద గుంతలు పూడ్చకపోవడం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయనితెలిపారు. గుంతలు పూడ్చకపోవడం వలన వాహనదారులు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. హైవే అధికారులు వెంటనే గుంతలు పూడ్చేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



విద్యార్థినులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

బ్రహ్మంగారిమఠం, మార్చి 1: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మండల విద్యాశాఖాధికారి పుల్లయ్య అన్నారు. బి.మఠంలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయంలో నేస్తం సేవా సంస్థ ఆధ్వర్యంలో దాతలు అరిగెల సురేంద్ర, భూమిరెడ్డి సురేష్ సహకారంతో శుక్రవారం పదోతరగతి చదువుతున్న 38మంది విద్యార్థులకు ఉచితంగా పరీక్ష మెటీరియల్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివి పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్, పాఠశాల ఎస్‌వో అనూష, అధ్యాపకులు పాల్గొన్నారు.

అమరవీరుల సంస్మరణ దినోత్సవం

జమ్మలమడుగు, మార్చి 1 : జమ్మలమడుగులో బాబు జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించి.. ఘనంగా నివాళులు అర్పించారు. ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు పిచికెబాబు మాట్లాడుతూ సామాజిక న్యాయమైన మాదిగ ఉపకులాల చిరకాల ఆకాంక్ష ఎస్సీ వర్గీకరణ లక్ష్యసాధన కోసం ఎంతో మంది ప్రాణాలను అర్పించారన్నారు. వారి త్యాగాలు వృధా కాకుండా మందక్రిష్ణమాదిగ నాయకత్వంలో త్వరలోనే ఎస్సీవర్గీకరణ సాధించి అమరవీరుల ఆశయాలను నెరవేరుస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వై.చిన్నయ్య, సెక్రటరీ కొండయ్య, బాల ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల ఎంపీడీవోగా జాషువ

ఎర్రగుంట్ల, మార్చి 1: ఎర్రగుంట్ల ఎంపీడీవోగా ఏ.జాషువ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన రైల్వేకోడూరులో ఎంపీడీవోగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

పోలియో నిర్మూలనకు కృషి చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 1: చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ ఏర్పాటుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డాక్టర్లు శివప్రసాద్‌రెడ్డి, హిమబిందులు పేర్కొన్నారు. శుక్రవారం సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పోలియో చుక్కలపై అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం పోలియో చుక్కల కార్యక్రమం ఉందని, అప్పుడే పుట్టిన బిడ్డ మొదలుకుని అయిదు సంవత్సరాలలోపు పిల్లలందరికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. సిర్డ్ సొసైటీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, హెల్త్ సెక్రటరి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 1: ఇంటర్మీడియట్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. పట్టణంలో 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిమిషం నిబంధనను పురస్కరించుకుని విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. 9 నుండి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. మొదటిరోజు మొదటి సంవత్సరం విద్యార్థులకు సంస్కృతం, తెలుగు, హిందీ, ఉర్దూ బాషా పరీక్షలు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు 144 సెక్షన్ విధించారు.

జమ్మలమడుగు: జమ్మలమడుగు పట్టణంలో శుక్రవారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జమ్మలమడుగులో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 277 విద్యార్థులకు 270 మంది పరీక్షలకు హాజరయ్యారు. బాలుర జూనియర్ కళాశాలలో 202 మంది విద్యార్థులకు 194 మంది, వివేకానంద జూనియర్ కళాశాలలో 220 మందికి 215 మంది పరీక్షకు హాజరయ్యారు. సాయిపరమేశ్వర జూనియర్ కళాశాలలో 217 మందికి 205 మంది విద్యార్థులకు పరీక్ష రాశారు.